## ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలలో అడ్మిషన్ల కోసం ఉత్తర్వులు జారీ

సంగారెడ్డి బ్యూరో, మే 19, ప్రభాతవార్త:
ఈ విద్యా సంవత్సరానికి ఐటిఐలలో అడ్మిషన్ కొరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పటాన్‌చెరువు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ యన్.శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఐటిఐలలో 2023-24/25 అడ్మిషన్ దరఖాస్తులు నవికరణ (ఆన్‌లైన్)లో మే 17 నుండి జూన్ 10 వరకు అప్లై చేసుకునే అవకాశం ఉన్నట్లు ఆయన తెలియజేశారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లను (యస్ఎస్‌సి, కుల ధృవీకరణ, స్థానికత (లోకల్) స్టడీ తెలంగాణలో చదవి ఉంటే వారిని స్థానికులుగా పరిగణిస్తారన్నారు. యస్‌యస్‌సి మెమో, టిసి, ఆధార్, ఆన్‌లైన్‌లో మీ ఫొటోతో సహా స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. అడ్మిషన్‌కు సంబంధించిన సమాచారాలు (ఎస్ఎంఎస్) ద్వారా మీకు లిఖిత పూర్వకంగా వస్తాయని, గవర్నమెంట్, ప్రైవేట్ ఐటిఐలలో గాను ఒకే రిజిస్ట్రేషన్‌తో విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఐటిఐ పటాన్‌చెరు కన్వీనర్, ప్రిన్సిపాల్ యన్.శ్రీనివాస్‌రావు తెలిపారు.




## కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి

**కొల్చారం, మే19 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన చింతల గంగరాజ్ (42) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. మద్యం సేవించి ప్రతి రోజు భార్యతో గొడవ పడేవాడు. అదేవిధంగా గురువారం సాయంత్రం మద్యం సేవించి భార్య లక్ష్మిని కొట్టడంతో మృతుడి తల్లి కోడలును తన ఇంటికి తీసుకెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన గంగరాజు ఇంట్లో దూలానికి చున్నీతో ఉరి వేసుకని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున మృతుని తల్లి గంగరాజు ఇంటికి వచ్చి చూడగా తలుపులు వేసి ఉండటంతో పిలిచాన పలకకపోవడంతో ఇంటి కిటికీలోంచి కూడగా గంగరాజు చున్నీతో ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

### జూన్ 5 లోగా కనీస వేతనం ప్రకటించకుంటే
## నిరవధిక సమ్మెకు దిగుతాం : రేషన్ డీలర్లు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లకు జూన్ 5లోపు కనీస గౌరవ వేతనం ప్రకటించాలని లేనియెడల 5 తర్వాత నిరవధిక సమ్మెకు దిగుతామని రేషన్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కూర ప్రకాష్, కార్యదర్శి బొజ్జ నరేందర్, జిల్లాశాఖ గౌరవాధ్యక్షులు మంద లక్ష్మారెడ్డి, టి.రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ఉపాధ్యక్షులు వంగరి నాగరాజులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రేషన్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలోని రేషన్ డీలర్లకు కనీస గౌరవవేతనం రూ.30 వేలు, పట్టణ ప్రాంతంలోని డీలర్లుకు రూ.35 వేల నుంచి రూ.45 వేలు చెల్లించాలన్నారు. రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, దిగుమతి హమాలీ ప్రభుత్వమే భరించాలని శాశ్వత అథరైజేషన్ ఇవ్వలన్నారు. కారుణ్య నియామకాలు 50 యేండ్లకు పెంచాలన్నారు. చనిపోయిన డీలర్ దహన సంస్కారాలకు అర్థిక సహాయం అందించాలన్నారు. ఎంఎల్‌సి పాయింట్ల నుంచి వచ్చే ప్రతి బస్తాకు 1 నుంచి 3 కిలోల బియ్యం తూకంలో తక్కువగా వస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రేషన్ డీలర్ల సమస్యలను జూన్ 5 లోగా పరిష్కరించకుంటే జెఎసిగా నిరవధిక సమ్మెకు వెళ్తామని నోటిసు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు నందకిషోర్, సత్యనారాయణ, సందీప్, శ్రీనివాస్, సంకీర్తిరెడ్డి, జ్యోతి, స్వప్న, నాగేందర్, లక్ష్మీఅశోక్, మల్లేశం, పోచయ్య, చంద్రశేఖర్,కనకయ్య, లక్ష్మయ్య, వెంకటయ్య, నరేందర్, బాలమల్లు, జూలురి నాగభూషణం, నారాయణరెడ్డి, స్వామి, నర్సింలు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :
జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ అర్బన్ మండలంలోని పలు భవనాల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి తన్నీరు హరీష్‌రావు అదేశాల మేరకు సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి శివారులో రూ.4 కోట్లతో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య భవనం, కోటి రూపాయాలతో నిర్మిస్తున్న వృద్దాశ్రమం, రూ.50 లక్షలతో నిర్మిస్తున్న మహిళ ప్రాంగణం పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో రూ.88 లక్షలతో నిర్మిస్తున్న సఖిసెంటర్,రూ.50 లక్షలతో నిర్మిస్తేన్న బాలరక్షక భవనం, రూ.4 కోట్లతో నిర్మిస్తున్న వర్కింగ్ ఉమెన్స్ హస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. రంగనాయసాగర్ వద్ద టూరిజంశాఖ అధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించారు. పట్టణంలోని బాలసదన్ సందర్శించి శిశు రక్ష భవనంపై నిర్మించిన డార్మెటరీ గదులను పరిశీలించారు. ప్రారంభోత్సవానికి సిద్దం చేయాలన్నారు. అంతకు ముందు సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లిలో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో సుడా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుడా మిట్టపల్లి మోడల్ లే అవుట్‌ను కలెక్టర్ పరిశీలించారు. అయన వెంట వివిధశాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## అటవీ, రెవెన్యూ శాఖల మధ్యవివాదంలో ఉన్న భూములను సర్వే చేసి నివేదిక అందజేయాలి
### -జిల్లా కలెక్టర్ రాజర్షిషా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, చిత్రంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, మే19 ప్రభాతవార్త:** మెదక్, హవేళిఘనపూర్ మండలాల్లో అటవీ, రెవిన్యూ శాఖల మధ్య వివాదంలో ఉన్న భూములను సంయుక్తంగా సర్వే చేసి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అటవీ, రెవిన్యూ శాఖల మధ్య వివాదంలో ఉన్న భూముల పరిష్కారంపై అదనపు కలెక్టర్ రమేష్, అటవీ, రెవిన్యూ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ మండలంలోని ఖాజిపల్లి, బాలానగర్, గుట్టకిందిపల్లి, హవేళిఘనపూర్ మండలంలోని బూర్గుపల్లి, బొగడ భూపతిపూర్‌లలోని వివిధ సర్వే నెంబర్లలో అటవీ, రెవిన్యూ శాఖల మధనయ వివాదంలో ఉన్న భూములను సంయుక్తంగా సర్వే నిర్వహించి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా పక్కాగా డిమార్కింగ్ చేయాలని సూచించారు. కాస్తులో ఉన్న లబ్ధిదారులకు పట్టాలిచ్చిన భూమి అటవీ పరిధిలో ఉన్నట్లయితే వాటిపై ప్రభుత్వానికి ప్రత్యేక అనుమతికై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా అటవీ శాఖాధికారికి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్, ఆర్డీవో సాయిరాం, జిల్లా పరిషద్ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మనోజ్ కుమార్, తహశీల్దార్లు శ్రీనివాస్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ మొబిలైజేషన్ 80 శాతం కావాలి

### లేబర్ వేజ్ రేట్ రూ.200 కన్నా తక్కువ ఉండరాదు : కలెక్టర్ శరత్

సంగారెడ్డి బ్యూరో, మే 19, ప్రభాతవార్త:
జిల్లాలోని అన్ని మండలాల్లో ఆక్టివ్ లేబర్లో 80 శాతం లేబర్ మొబిలైజేషన్ జరగాలని, లేబర్ వేజ్ రేట్ రూ.200 కన్నా తక్కువ ఉండరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేబర్ మొబిలైజేషన్ 80 శాతం కన్నా తక్కువ ఉన్నట్లైతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీ రూ.200ల కన్నా తక్కువ ఉండరాదన్నారు. లేబర్ ఎక్కువ పని గంటలు చేసేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత ఉన్నందున ఉపాధి కూలీలు పనిచేసే చోట తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం హరితహారంలో జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటడం లక్ష్యమని, ఆ మేరకు స్థలాలను గుర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ ప్లాంటేషన్, ఇన్స్టిట్యూషన్స్, వైకుంఠధామాలు, డంపు యార్డులలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కల గ్యాప్స్ గుర్తించి కొత్త మొక్కలు పెట్టాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలని, జిల్లాలో ధాన్యం రవాణాకు లారీల కొరత రాకూడదని తెలిపారు. లారీల మొబిలైజేషన్‌లో రెవెన్యూ, ట్రాన్స్‌పోర్టు అధికారులు కోఆర్డినేషన్ చేసుకుంటూ ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు బాగా జరుగుతున్నాయని, కొన్ని చోట్ల నిర్లక్ష్యం కనిపిస్తుందని, ఆయా సెంటర్ల సూపర్వైజరీ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీఓ 59లో చెల్లించాల్సిన మొత్తం ఐదు లక్షల లోపు ఉన్న లబ్దిదారులు వెంటనే చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్లకు సూచించారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను గ్రామం వారీగా ఈనెల 26లోగా అందించాలని తహాశీల్దార్లకు ఆదేశించారు. ఓటర్ జాబితా రిలేటెడ్ పనులు బాగా చేశారని తహాశీల్దారులను అభినందించారు. ఫోటో సిమిలర్ ఎంట్రీ, డెలిశన్స్ తదితరాలకు సరి అయిన చర్యలు తీసుకోవాలని, ఒకటికి రెండు సార్లు పరిశీలించి ప్రాపర్‌గా చేయాలని సూచించారు. అదేవిధంగా ఒకే ఇంటి నంబర్‌తో 6 మంది కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాలను విధిగా పరిశీలించాలని తెలిపారు. బిఎల్ఓల వివరాల జాబితాను పొలిటికల్ పార్టీల ప్రతినిధులకు ఇవ్వాలన్నారు. ఈనెల 17 నుండి 23 వరకు కొనసాగుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో ఆయా నిర్దేశిత పనులను సజావుగా చేయాలని ఎంపిడిఓ, ఎంపిఓ, పంచాయతీ సెక్రెటరీలకు సూచించారు. ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలు విజయవంతం చేయాలని, అందుకు అధికారులందరూ భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల స్థాయి క్రీడలను విజయవంతం చేసిన అధికారులందరిని కలెక్టర్ అభినందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ సురేష్ మోహన్, సివిల్ సప్లైస్ డిఎం సుగుణబాయ్, మెప్మా పీడీ గీత, గిఎస్ఓ వనజాత, ఆర్డీఓ శివలింగయ్య, డిఆర్‌డిఏ అదనపు పీడీలు, మండల ప్రత్యేక అధికారులు, ప్యాక్స్ సీఈఓలు, ఆర్డీఓలు, తహాశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఏపిఓలు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తన రహిత జిల్లాగా రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

### నకిలీ విత్తనాల చలామణిపై ఉక్కుపాదం మోపాలి
### రైతులకు నష్టం జరిగితే సహించబోం : కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, మే 19, ప్రభాతవార్త:** జిల్లాను నకిలీ విత్తన రహిత జిల్లాగా రూపొందించాలని, అందుకు విత్తన డీలర్లు జిల్లా యంత్రాంగానికి రైతులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వ్యవసాయ అధికారులు, విత్తన ఎరువులు, పరుగు మందుల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, రైతులకు ఎలాంటి నష్టం జరిగినా ప్రభుత్వం సహించబోదన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఉండరాదని స్పష్టం చేశారు. చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడి నుండి కూడా అనాథరైజ్ విత్తనాలు, పురుగు మందులు రాకూడదని, అమ్మ కూడదన్నారు. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ) ధ్రువీకరించిన విత్తనాలు మాత్రమే కొనేలా చూడాలని సూచించారు. కల్తీ విత్తనాలు లేకుండా నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాల చలామణిని ఏఓలు, ఏఈఓలు, పోలీస్‌శాఖ అధికారులు కోఆర్డినేషన్‌తో కంట్రోల్ చేయాలన్నారు. జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా అవుతుందని, పత్తి విత్తనాలు మహారాష్ట్ర, కర్ణాటక నుండి రాకుండా నిఘా పెట్టాలని సూచించారు. హెటి కాటన్ విత్తనాను కానరాదని రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. నిబంధనలు పాటించాలని, లైసెన్స్ నిబంధనలు తెలుసుకోవాలని సూచించారు. అనాథరైజ్డ్ వ్యక్తుల నుండి విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. మంచి విత్తనాలు సరఫరా చేసి రైతులకు అధిక ఉత్పత్తి వచ్చేలా చూడాలని డీలర్లను కోరారు. అనంతరం జిల్లా ఎస్పి రమణకుమార్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగు మందుల చలామణి జరగకుండా ఉక్కు పాదం మోపాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా నకిలీ నాసిరకం విత్తనాలు, నకిలీ ఎరువులు, పురుగు మందులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించి సహకరించాలన్నారు. రైతులకు నాణ్యమైన సర్టిఫైడ్ విత్తనాలు అమ్మాలని డీలర్లకు సూచించారు. నకిలీ విత్తనాలతో ఏ ఒక్క రైతు పంట నష్టపోరాదన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై పిడి యాక్ట్‌లో కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ శివకుమార్, డీఎస్‌పిలు, వ్యవసాయ శాఖ జెడి నరసింహారావు, సివిల్ సప్లై డీఎం సుగుణభాయ్, డీఎస్ఓ వనజాత, విత్తన ఎరువుల డీలర్లు, ఏడిఏలు, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్యక్రమాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న అదపు కలెక్టర్ ప్రతిమ సింగ్

## పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి
### -అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

**కొల్చారం, మే19 ప్రభాతవార్త:** మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపట్టవలసిందిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని 18వ వార్డు గాంధీనగర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణమే ద్యేయంగా అంటు వ్యాధులు ప్రబలకుండా వర్షాకాలనికి ముందే నేటి నుండి 27వ తేదీ వరకు మున్సిపల్ ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిఇ పెట్టి షెడ్యూల్ ప్రకారం అనినన వార్డుల్లో కార్యక్రమాలు చేపట్టవలసిందిగా మున్సిపల్ డైరెక్టర్ మార్గదర్శకాలను జారీ చేశారని ఆమె తెలిపారు. ఈ మేరకు ప్రతి వార్డులో స్వచ్ఛత కోసం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టుటకు కార్మికులకు దిశా నిర్దేశం చేయవలసిందిగా మున్సిపల్ కమీషనర్‌కు సూచించారు. ప్రధానంగా మురికి నీరు సాఫీగా పారే విధంగా సైడ్ డ్రైన్స్ క్లీన్ చేసి చెత్తను తొలగించాలని, డ్రైన్స్, రోడ్డు ప్రక్కల ముళ్ల పొదలను తొలగించాలని, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచాలని, మాసం దుకాణాల వద్ద వ్యర్థాలను తొలగించాలన్నారు. అదేవిధంగా ఇండ్లలో తడి, పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలని, అంతర్గత రహదారులు, ప్రధాన రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ప్రజోపయోగ సంస్థలను శుభ్రం చేయాలని, లోతట్టు ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలు, నిర్మాణాలను గుర్తించి తొలగించి ఆ ప్రాంతాన్ని చదును చేయాలని సూచించారు. అలాగే పాడుబడిన బావులను, బోర్లను పూడ్చివేయాలని అన్నారు. దోమల కారణంగా ప్రజలు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పిస్తూ ఫాగింగ్, సోడియం హైపో క్లోరైడ్ స్ప్రే చేయాలని, నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, తాగునీటి వనరులను క్లోరినేట్ చేయాలని ప్రతిమ సింగ్ సూచించారు. అనంతరం డంపుయార్డ్‌ను సందర్శించి పాత చెత్తను బయో మైనింగ్ ద్వారా పౌడర్ చేసి అవసరమైన ఫ్యాక్టరీలకు విక్రయించాలని సూచించారు. తద్వారా డంప్‌యార్డు శుభ్రమవుతుందని, అక్కడ పార్క్ ఏర్పాటు చేయడానికి అవకాశం ఉటుందని అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ కమీషనర్ జానకిరామ్ సాగర్, కౌన్సిలర్ సమోయొద్దీన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

చిన్నకోడూరు, మే 19, ప్రభాతవార్త :
మండల పరిధిలోని రామునిపట్ల గ్రామంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. హమాలీల సంఖ్య పెంచి ధాన్యం కొనుగోలు మరింత వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీ సాయి శివ బాలాజీ ఇండస్ట్రీస్ సందర్శించి ధాన్యం వెంట వెంటనే దిగుమతి చేసుకోవాలని అదేశించారు. ఎఫ్ఎక్యూ ధాన్యాన్ని తాలు, తూకం పేరిట కొతలు విధిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయన జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతసాగర్, శనిగరం, రేగులపల్లి కొనుగోలు కేంద్రాలను అయన సందర్శించారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

# ధాన్యం కొనుగోలు చేయాలంటూ రోడ్డెక్కిన రైతులు

### రోడ్డుపై ధాన్యం తగులబెట్టి ధర్నా రాస్తారోకో
### మద్దతు తెలిపిన కాంగ్రెస్, బిజెపి నాయకులు

**నర్సాపూర్, మే 19, ప్రభాతవార్త:** ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ వివిధ గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వానికి నిరసనగా ధాన్యాన్ని తగులబెట్టి చావు డప్పుకొడుతూ రెండు గంటల పాటు రాస్తారోకో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నా రాస్తారోకో కార్యక్రమంతో ఎక్కడి వాహానాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివకుమార్ తన బలగాలతో సంఘటన స్థలానికి చేరుకొని రైతులను బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు నచ్చజెప్ప ప్రయత్నం చేసినా జిల్లా కలెక్టర్ వచ్చి తమ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చెంత వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని రైతులు రోడ్డు పై భైఠాయించారు. ఎస్ఐ శివకుమార్ తన బలగాలతో ఆందోళన కారులను అ రెస్ట్ చేసే ప్రయత్నం చేసినా ఆందోళన కారులు వినకుండా ముఖ్యమంత్రి కెసిఆర్ డౌన్‌డౌన్ అంటు నినాదాలు చేస్తు భైఠాయించారు.దీంతో ఎస్ఐ శివకుమార్, మండల తహాశీల్దార్ ఆంజనేయులు సంఘటన స్థలానికి పిలిపించి రైతులకు నచ్చజెప్ప ప్రయత్నం చేశారు. అయినా రైతులు వినకుండా ధర్నా రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నుంచి ఖచ్చితమైన హామీ ఇస్తె తప్ప తాము ధర్నా విరమించేది లేదని మొండికేశారు. ఈమేరకు తహాశీల్దార్ ఆంజనేయులు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఖచ్చితంగా మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి లు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకువెళ్ళెందుకు లారీలు రాక కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలు కుప్పలుకుప్పలుగా పేరుకపోతున్నాయని అన్నారు. దీంతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైస్‌మిల్లర్లు కుమ్ముక్కై ఒక్క ధాన్యం బస్తా పై తరుగు పేరిట 8 కిలోల తరుగు తీస్తున్నారని అన్నారు.వెంటనే అధికారులు స్పందించి తరుగు తీస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోని రైతులను ఇబ్బందులు లేకుండా దాన్యం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ బిజెపి పార్టీ నాయకులు మల్లేషం, అశోక్‌గౌడ్, సురేశ్‌నాయక్, యాదగిరి, బాల్‌రాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులను సముదాయిస్తున్న తహాశీల్దార్ ఆంజనేయులు,ఎస్ఐ శివకుమార్ తదితరులు

## మిర్చి మార్కెట్‌లలో అవకతవకలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు


కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

**చిన్నకోడూరు, మే 19, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండల పరిధిలోని గంగాపూర్, మాచాపూర్‌లో నిర్వహించే మిర్చి మార్కెట్‌లలో కొంత మంది వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా ఎజెంట్లుగా ఏర్పడి సిండికెట్‌తో ఇష్టానుసారంగా ధరలు నిర్ణయిస్తూ రైతులకు తక్కువ ధర చెల్లిస్తూ మోసం చేస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రైతులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేసిన ఏజెంట్లు 20 నుంచి నెల రోజుల వరకు డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇది ఏమిటని ప్రశ్నిస్తే రైతులను బెదిరింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఏజెంటుగా ఉన్న వ్యక్తి రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేసి లక్షల రూపాయాల మోసం చేసిన పట్టించుకునే నాథుడు లేడన్నారు. మార్కెట్లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో లక్షల రూపాయాలు ప్రభుత్వ అదాయానికి గండికొడుతున్నారని తెలిపారు. మార్కెట్ల వద్ద కనీస సౌకర్యాలు లేవని వెంటనే రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మీసం మహేందర్ యాదవ్, సందబోయిన పర్శరాములు, రైతులు రాజు, నాగరాజు, ఎల్లయ్య, అజయ్, రాజమల్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం చైర్మన్‌కు ఘన సన్మానం

**మిరుదొడ్డి, మే 19, ప్రభాతవార్త :** రాష్ట్ర నూతన మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా పిట్టల రవీందర్ ముదిరాజ్ ఎన్నిక కావడంతో హైదారాబాద్‌లో శుక్రవారం అయనను కలిసి మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు అయిల విద్యాసాగర్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈనెల 22 పిట్టల రవీందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలంలోని మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కుమ్మరి శివయ్య, తుమ్మల ప్రశాంత్, గొట్టం బైరయ్య, చిగురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో యువత రాణించాలి

### జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్

**మునిపల్లి, మే 19, ప్రభాతవార్త:** క్రీడల్లో యువత రాణించి మంచి నైపుణ్యం పొందాలని జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రం మునిపల్లిలో సిఎం కప్ క్రీడలు ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మార్వో శివకుమార్, ఎంపిడీవో అభినందన్‌రావుతో పాటు జడ్పీటీసీ మీనాక్షి కలిసి సిఎం క్రీడల్లో గెలుపొందిన యువతకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో బిఎస్‌ఆర్ రాష్ట్ర నాయకులు పిఎస్ ఆర్‌ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయికుమార్, ఎంఈవో దశరథ్, మునిపల్లి సర్పంచ్ రమేష్, నాయకులు నగేష్, సురేష్, అల్లా పూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సారేపల్లి దాలి మృత్యుంజయరావు మృతి



మృత్యుంజయరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు

**గుమ్మడిదల, మే 19, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామికవాడలో శాం పిస్టన్ సీఎండి సారేపల్లి దాలి మృత్యుంజయరావు శుక్రవారం స్వర్గస్తులయ్యారు. విషయంపై స్థానిక నాయకులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా బొంతపల్లితో పాటు ఇతర గ్రామాలకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తూ అందరి మనలను పొందుకున్నారని అలాగే ఎవరికీ ఏ ఆపద వచ్చినా కష్టకాలంలో సంప్రదించిన ఆయన కుండా తనకు తోచిన సహాయం చేస్తుండేవాడని పలువురు కంటతడి పెట్టారు. ముఖ్యంగా ఆయన తమ పరిశ్రమ సేవా కార్యక్రమాలు దేవాలయాల నూతన నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలకు కావలసిన సదుపాయాలు, అలాగే కార్మికుల ఆడపిల్లల పెళ్లికి కూడా తనకు తోచిన సహాయం చేస్తూ ఆదుకునే వారని పలువురు కార్మికులు గుర్తు చేసుకు న్నారు. ఆయన మృతి పట్ల పలువురు పెట్టుకొని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని శ్రద్ధాంజలి ఘటించారు.

## కంటి వెలుగు ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం : జడ్పీటిసి



వైద్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

**గుమ్మడిదల, మే 19, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు ముగింపు కార్యక్రమం స్థానిక సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక జడ్పీటిసి సభ్యులు కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. వైద్యాధికారులు మధుకర్, స్రవంతి, ఏఎన్ఎం శశికళ, మణెమ్మ, వసంత, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఇతర టెక్నికల్ సిబ్బందిని జడ్పీటిసి కుమార్‌గౌడ్ శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 13 గ్రామ పంచాయతీలలో కంటి వెలుగు విజయవంతంగా 100 శాతం పూర్తి చేశారని, తెలంగాణ రాష్ట్ర జాతిపిత కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు అనే ఒక మహోత్సవమైన కార్యక్రమం చేపట్టి ప్రతి వారికి జ్ఞానేంద్రియాలలో కన్ను ముఖ్యమని గ్రహించి కంటి వెలుగు అనే కార్యక్రమాలను ఏర్పాటు చేసి వైద్యుల ద్వారా చికిత్స అందించి వారి సలహా మేరకు కళ్లద్దాలను అందివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యపాత్ర వైద్యాధికారులని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు రామ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, కిరణ్‌గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఆశావర్కర్లు పుణ్యమ్మ, విజయలక్ష్మి, నాగమణి, యాదమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కంఠారెడ్డి



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

**మెదక్ రూరల్, మే 19, ప్రభాతవార్త:** మెదక్ మండలం మక్త భూపతి పూర్ గ్రామానికి చెందిన కొమ్ము శ్రీకాంత్ ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కలిపోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి దగ్ధమైన గుడిసెను పరిశీలించి తక్షణ సహాయం కింద రూ.5 వేలు అందివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిసిసి నాయకులు మామిళ్ల ఆంజనేయులు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పల్లె రాంచందర్‌గౌడ్, మెదక్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్, పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులుగౌడ్, మురళి, సిద్ధగౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ఎంపిటిసి రమేష్‌గౌడ్, ఎస్టీ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, మహేష్‌కుమార్, ఉదయ్‌కుమార్, అజయ్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏల పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

**అల్లాదుర్గం, మే19 ప్రభాతవార్త:** వీఆర్ఏలకు పేస్కేల్ ఇస్తూ కేబినెట్ సమావేశంలో అందరినీ ఇతర డిపార్ట్‌మెంట్‌లకు బదిలీ చేస్తున్నట్లు తెలంగాణ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ సీసీఎల్ఏకు ఆదేశించడంతో మండలంలోని వీఆర్ఏలు శుక్రవారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మం దలంలోని వీఆర్ఏలు రెవిన్యూ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

### ఫ్లిప్‌ను ప్రారంభించిన జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్

ప్రసిద్ధ ఇన్వెస్ట్‌మెంట్ సేవల కంపెనీ జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తన కొత్తమొబైల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారంఫ్లిప్‌ను ప్రారంభాన్ని ప్రకటించింది. ప్రస్తుత సెల్ఫీ ప్లాట్‌ఫారం స్థానాన్ని ఇది భర్తీ చేస్తుంది. ఆధునిక ఫీచర్ల శ్రేణి మద్దతుతో ఇది ఇన్వెస్టర్లు,ట్రేడర్లకు సమగ్రమైన ఆనుకూలమైన ట్రేడింగ్ అనుభవాన్ని అందిస్తుంది. ఫ్లిప్‌తో ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఒక కీలకమైన అడుగును ముందుకు వేశామని మేము నమ్ముతున్నామని జియోజిత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నారు.



కాశీపూర్‌లో సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధి కూలీలు

# సుందరయ్య జీవితం భావితరాలకు ఆదర్శం

**కంది, మే 19, ప్రభాతవార్త:** మండలంలోని కాశీపూర్‌లో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి వేడుకలను సిపిఎం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. సుం దరయ్య చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అశోక్ మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ కార్మికులు, రైతులు, పేదల పక్షాల పోరాటం చేసిన ధీరుడు సుం దరయ్య అని గుర్తు చేసుకున్నారు.సిపిఎం నాయకులు కుమార్, సుదర్శన్ పాల్గొన్నారు.

### మునిపల్లిలో..

**మునిపల్లి, మే 19, ప్రభాతవార్త:** సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమిద్దామని సిపిఐఎం మండల ప్రధాన కార్యదర్శి కుమార్ అన్నారు. శుక్రవారం మునిపల్లి మండలం మల్లారెడ్డిపేటలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నాయ కులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున్‌పల్లిలో ఉపాధి కూలీలతో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించగా, ఐల్లపూర్ గ్రామంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామి కూలీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

## గంగోజిపేటలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

### -టోర్నీ విజేత జట్టుకూరూ.25వేల బహుమతి

**చౌటకూరు, మే 19, ప్రభాతవార్త:** మండలంలోని గంగోజిపేటలో గత 13 రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసాయి. గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం సుబ్బారెడ్డి మనవడు మొండెద్దుల నటరాజ్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగిన టోర్నమెంట్‌లో ఆయా గ్రామాలకు చెందిన 26 జట్లు తలపడ్డాయి. టోర్నీ ముగింపులో శివంపేటకు చెందిన ఎస్ఎస్ స్టార్, అంబేద్కర్ జట్లు తలపడగా ఎస్ఎస్‌స్టార్ జట్టు అంబేద్కర్ జట్టుపై విజయం సాధించి టోర్నీ కప్‌ను కైవశం చేసుకుంది. టోర్నీ విజేత జట్టుకు 25వేల నగదుతో పాటు కప్‌ను, రన్నర్‌గా నిలిచిన జట్టుకు 15వేల రూపాయలను అందచేశారు. మ్యాన్ ఆఫ్ ద సీరిస్‌గా శివంపేట గ్రామానికి చెందిన మన్నె శాంతికుమార్ కైవశం కాగా 5వేల నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో సిడిసి మాజీ చైర్మన్ భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ బుర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి పుల్కల్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బక్కారెడ్డి కిష్టారెడ్డి, కోడూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల సర్పంచ్‌లు పట్లోళ్ల నర్సింహారెడ్డి, న్యాత మాణయ్య, ఉప సర్పంచ్ గుండన్నోల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాణిక్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, కుమ్మరి అశోక్ పాల్గొన్నారు.

## ఓపెన్ నాలా సమస్యలు పరిష్కరించండి



అపార్ట్‌మెంట్ వాసులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే,కార్పోరేటర్‌లు

**రామచంద్రాపురం, మే 19, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీ పక్కన కొత్తగా నిర్మించిన ఎస్బిఎస్పీ అవతార్ అపార్ట్‌మెంట్ వాసులతో శుక్రవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, రామచంద్రాపురం కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌లు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పరిచయ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెలే, కార్పోరేటర్లను అపార్ట్‌మెంట్ వాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్‌కు పక్కనే గల ఓపెన్ నాలతో ఆరోగ్యాలు పాడవుతున్నాయని, లో ఓల్టేజి సమస్య, ఓటరు కార్డులో చిరునామ మార్పిడి, ప్రాపర్టీ టాక్స్ సమస్యలను అపార్ట్‌మెంట్ వాసులు ఎమ్మెల్యే, కార్పోరేటర్ల దృష్టికి తీసుకుపోయారు. ఓపన్‌నాలాను లింగంపల్లి నుంచి నక్కవాగు వరకు బాక్స్ డ్రైన్‌గా నిర్మించడానికి చర్యలు జరుగుతున్నాయని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని భరోసా ఇచ్చారు. ఓటరు కార్డు చిరునామ విషయాలను తహసీల్దార్ దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాపర్టీ టాక్స్ విషయమై డిప్యూటీ కమీషనర్‌తో చర్చించి బిల్ కలెక్టర్‌ను పంపిస్తామన్నారు. కార్యక్రమంలో పరమేష్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, పాండు, గడ్డం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సర్వీస్ రోడ్డును పూర్తిచేయండి : కార్పోరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కనుకుంట గుండమ్మ ఆలయం వెనుకాల నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలోకి మారేందుకు ఫ్లైఓవర్, సర్వీస్‌రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆర్అండ్‌బి డీఈ రామకృష్ణకు సూచించారు. శుక్రవారం సాయంత్రం కాంట్రాక్టర్, అధికారులతో కలిసి నిర్మాణ పనులను కార్పోరేటర్ పరిశీలించారు. ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్డు పనులు పూర్తయితే ఆలయం మారుటకు అవకాశం ఉంటుందని, అందుకు నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కార్పోరేటర్ పుష్పనగేష్ సూచించారు.వీరేశంగౌడ్, మల్లేష్, కుమ్మరి సత్యనారాయణ, ఆలయ కమిటి బాధ్యులు పాల్గొన్నారు.

## దత్తగిరి ఆశ్రమంలో జిల్లా ఎస్‌పి పూజలు



దత్తగిరి ఆశ్రమంలో శనీశ్వరుడిని దర్శించుకుంటున్న జిల్లా ఎస్పీ రమణకుమార్

**ఝరాసంగం, మే 19, ప్రభాతవార్త:** మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమాన్ని శుక్రవారం జిల్లా ఎస్‌పి యం రమణకుమార్ సందర్శించారు. ఆశ్రమానికి చేరుకున్న ఎస్‌పి రమణకుమార్‌ను ఆశ్రమ రాజగోపురం వద్ద వైదిక పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం శ్రీ శనేశ్వరుడి జయంతి, అమావాస్య పర్వదినాలను పురస్కరించుకుని ఆశ్రమ ఆవరణలోని శ్రీ శనేశ్వర విగ్రహానికి ఎస్‌పి తైలాభిషేకం చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాలకు ఎస్‌పి రుద్రాభిషేకం, మహామంగళ హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమానికి చేరుకున్న ఎస్‌పి రమణకుమార్‌ను ఆశ్రమ పీఠాధిపథులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ (అప్పగారు), డాక్టర్ మహంత్ సిద్దేశ్వర స్వామి శాలువా,పూలమాలలతో సత్కరించి ఆశీర్వచనాలు చేసి తీర్ధ ప్రసాదాలు అందచేశారు.మాతృశ్రీ అనసూ యమాత, గ్రామ సర్పంచ్ వివలక్ష్మి కృష్ణ, ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మునిపల్లి ఎంపిడివోగా హరినందన్‌రావు

**మునిపల్లి, మే 19, ప్రభాతవార్త:** మునిపల్లి సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల అభివృద్ధి అధికారిగా హరినందన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు రీ డిప్లైడ్ ఎంపిడివోగా పని చేసిన అంజనీదేవిగా రాయికోడ్ ఎంపిడీవోగా బదిలీపై వెళ్లారు. కాగా మునిపల్లి నూతన ఎంపిడివోగా హరినందన్‌రావు ఇప్పటి వరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అసిస్టెంట్ పర్సనల్ సెక్రెటరీ గా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతన ఎంపిడివోకు కార్యాలయ సిబ్బంది సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు.



శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

## పోలీసులు, ప్రజల సమన్వయంతో ప్రమాదాల నివారణ

### హుస్నాబాద్ ఏసీపీ సతీష్, సీఐ కిరణ్‌లు

**హుస్నాబాద్, మే 19, ప్రభాతవార్త :** ఫస్ట్ రెస్పాండెంట్ ప్రథమ చికిత్స, సీపీఆర్, ఏఈడీలపై హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలకు చెందిన 10 మంది యువకులు, వాలంటీర్లకు కమిషనర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని హుస్నాబాద్ ఏసీపీ సతీష్, సీఐ కిరణ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సిద్దిపేట పోలీసుశాఖ అధ్వర్యంలో సీపీ శ్వేత ఆదేశాల మేరకు సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని గ్రామాలలో, పట్టణాలలో ఉన్న యువకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. వాలంటీర్స్‌కు రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే చేయదగ్గ చికిత్సలు, సహజ సిద్ధంగా 24 ఎమర్జెన్సీ చికిత్సలు, అత్యవసర పరిస్థితి ఎలా గుర్తించాలనే విషయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహి ంచమన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులను వెంటనే ఆసుపత్రికి పంపం చాలా ముఖ్యమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపే వారు సీట్ బెల్టు ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన కాగితాలను ఎప్పుడు వెంట తెచ్చుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు, పోలీసులు, యువకులు సమన్వయంతో ఉన్నప్పుడు ప్రమాదాలను నివారించడం సులభతరమన్నారు. శిక్షణ పొందిన 17 మంది యువకులను వాలంటీర్లను ఘనంగా సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు గడ్డం నరేందర్‌రెడ్డి, తాం ద్ర వివేక్, తోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైకోడ్‌లో మహార్యాలీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



మహార్యాలీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లింగాయత్ బాధ్యుల

**మనూర్, మే 19, ప్రభాతవార్త:** లింగాయత్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం జూన్ 4వ తారీఖున రాష్ట్ర రాజదాని హైద్రాబాద్‌లోని నాంపల్లిలో గల ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే మహార్యాలీని జయప్రదం చేయాలంటూ వీరశైవలింగాయత్ బాధ్యులు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. మండలంలోని మైకోడ్ గ్రామంలో లింగాయత్ సమాజ్ బాధ్యులు గోడ పత్రికలను ఆవిష్కరించడంతో పాటు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో గోడపత్రికలను అంటించారు. వీరశైవులను ఓబిసిగా ప్రకటించడం, ఢిల్లీలో నిర్మించిన కొత్త పార్లమెంట్ భవనానికి అనుభవ మండపము అని నామకరణం చేయడం, అందరి వాడు మహాత్మా బసవేశ్వరుడి సూక్తులను భారత దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కెజి నుంచి పిజి వరకు పాఠ్యపుస్తకాల్లో ప్రచురించడం, పేద లింగాయత్‌ల ఉన్నతికి ఆర్థిక సహకారంతో లింగాయత్ కార్పోరేషన్ ఏర్పాటు చేయడం లాంటి డిమాండ్లతో మహార్యాలీని నిర్వహిస్తున్నట్లు, హైద్రాబాద్‌కు తరలేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు, అందుకు ఆయా గ్రామాల వారు ముందస్తుగా లింగాయత్ సమాజ్‌కు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వివరించారు. బాధ్యులు సూచించారు. ఆన్విశానంద స్వామి, రాష్ట్రీయ బసవదళ్ నారాయణఖేడ్ ఇంచార్జి బిరేదార్ నగేష్, నాయకులు వడ్డి ఆనందీశ్వర్, రమేష్‌పాటిల్, రేవన్న, శేరి సంగన్న, రాజ్‌కుమార్, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఆర్ యువసేనలో చేరిన నారాయణ చారి

### -సాధారంగా స్వాగతం పలికిన నీలం మధు ముదిరాజ్



ఎన్ఎంఆర్ యువసేనలోకి స్వాగతం పలుకుతున్న నీలం మధు ముదిరాజ్

**రామచంద్రాపురం, మే 19, ప్రభాతవార్త:** ఎన్ఎంఆర్ యువసేన చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై పటాన్‌చెరు విశ్వకరన్మ సంఘం ఇంచార్జి నారాయణ చారి ఎన్ఎంఆర్ యువసేన శుక్రవారం చేరారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాగులపల్లికి చెందిన విశ్వకర్మ సంఘం పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి నారాయణను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ శాలువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. యువసేన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడతామని నారాయణచారి వివరించారు.తలారి మధుసూదన్, పటిమేది పాండు, సిహెచ్ వెంకటేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ విద్యార్థినులకు బ్లాక్ బెల్ట్ ట్రైనింగ్ క్యాంపు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 19, ప్రభాతవార్త:** సంగారెడ్డి పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినీలకు బ్లాక్ బెల్ట్ ట్రైనింగ్ క్యాంపు కార్యక్రమం మాస్టర్ మల్లేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్నం మాణిక్యం ముఖ్యఅతిథిగా హాజరై పట్నం మాణిక్యం ఫౌండేషన్ ద్వారా విద్యార్థినీలకు సర్టిఫికేట్లు, మెమొంటోస్ అందజేశారు. విద్యార్థినీల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పట్నం మాణిక్యం, డిసిసిబి వైస్ ఛైర్మన్ ఉమ్మడి మెదక్ జిల్లా, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కరాటే ట్రైనర్ మాస్టర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఆయల్‌పామ్ సాగుపై సబ్సిడీని వినియెగించుకోవాలి

**అక్కన్నపేట, మే 19, ప్రభాతవార్త :**

అయిల్‌పామ్ సాగు విషయంలో వ్యవసాయదా రులు ముందుకు రావాలని ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించు కోవాలని మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి సబిహా రైతాంగానికి సూచించింది. అక్కన్నపేట మండలంలోని రైతు కర్ర ఉపేందర్ సాగు చేస్తున్న అయిల్‌పామ్ సాగును రైతాంగానికి చూపించింది. అయిల్ పామ్ సాగు చేసే రైతులు మూడు సంవత్సరాల వరకు అంతరపంటలను కూడా సాగు చేసుకునే వీలుందని వివరిం చారు. 30ఏళ్ళ వరకు రైతాంగం దిగుబడిని సాధంచే అవకాశం ఉన్నట్లు సబిహా రైతులకు వివరించింది.

## మండలానికి 400 బస్తాల జనుము విత్తనాలు

### -సోమవారం నుంచి రైతులకు సబ్సిడీపై సరఫరా

**న్యాల్‌కల్, మే 19, ప్రభాతవార్త:** మండలానికి 4వందల బస్తాల జనుము విత్తనాలు సరఫరా అయినట్లు మండల వ్యవసాయ అధికారి ఎన్ లావణ్య పేర్కొన్నారు. మండలానికి చేరుకున్న జనుము విత్తనాలను రైతులకు సోమవారం నుంచి మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని డిసిఎంఎస్‌ను సరఫరా చేస్తామన్నారు. ఒక్క కిలో జనుము ధర 87.50 రూపాయలు కాగా సబ్సిడీ 56.88 రూపాయలు పోను రైతులు 30.62 రూపాయలు చెల్లించి జనము విత్తనాలను అందుకోవాలన్నారు. 40 కిలోల బస్తాకు రైతులు 1224.80 (1225) చెల్లించి విత్తనాల బస్తాను తీసుకుపోవాలన్నారు. రైతులు తమ ఆదార్ కార్డు, పట్టా పాసుపుస్తకాలతో డిసిఎంఎస్ కార్యాలయానికి చేరుకుని విత్తనాలు అందుకుని పంట దిగుబడికి భూమితో జనుమును విత్తుకోవాలని ఏఓ లావణ్య వివరించారు.

## సొసైటీ వైస్ చైర్మన్‌ను సన్మానించిన టి బేస్



సొసైటీ వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న టిబేస్ నాయకుల దృశ్యం

**జహీరాబాద్(మొగుడంపల్లి), మే 19, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని ఇప్పేపల్లి సొసైటీ వైస్ చైర్మన్‌గా ప్రజలకు సేవలు అందిస్తున్న బంజారా నాయకులు హరిసింగ్‌ను శుక్రవారం టిబేస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మొగుడంపల్లి మండలంలోని తొట్టి తండాకు చెందిన హరిసింగ్‌ను బంజారా భవన్‌లో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిబేసన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ రాథోడ్, జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు తుకారాం చౌవాన్, ప్రధాన కార్యదర్శి హన్మంతు పవార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవి సింగ్ రాథోడ్, నాయకులు హీరాలాల్ పవార్, కిషన్ పవార్, రవి పవార్, శంకర్, గణేష్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

## అంధత్వ నివారణకే కంటి వెలుగు : మాజీ కౌన్సిలర్



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ కౌన్సిలర్ రవి కిరణ్

**జహీరాబాద్, మే 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రజలు కండ్ల సమస్యలతో సతమతమవకూడదని, ఏ ఒక్కరు అందత్వంతో అవస్థలు పడకూడదన్న లక్ష్యంతో తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని 14వ వార్డులో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని నామా రవికరణ్ పరశీలించారు. కంటి వెలుగు శిబిరాలను 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కండ్ల పరీక్షలతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలు, శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గడిపెద్దాపూర్ శివారులో మృతదేహం లభ్యం

**అల్లాదుర్గం, మే19 ప్రభాతవార్త:** అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామ శివారులో గురువారం సాయంత్రం కిష్టయ్య అనే రైతు తన వరి పంటను కోసేందుకు పొలానికి వెళ్లగా అక్కడ కుళ్లిపోయిన ఓ వ్యక్తి శవం కనిపించడంతో పాటు స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించి విచారణ నిర్వహిస్తున్నారు. మృతుని దుస్తుల్లో ఆధార్‌కార్డు లభించడంతో మృతి చెందిన వ్యక్తి టేక్మాల్ మండలం కుసంగి గ్రామానికి చెందిన తమ్మళి నారాయణ (65)గా గుర్తించిన పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు నారాయణ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. 15 రోజుల క్రితం గడిపెద్దాపూర్‌లో మల్లన్న జాతరకు వెళ్తున్నానని చెప్పిన వ్యక్తి మరల ఇంటికి రాలేదని, నారాయణకు కొన్ని సంవత్సరాల క్రితం ఒక యాక్సిడెంట్‌లో తలకు గాయాలై అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోయినవాడిలా ప్రవర్తించే వాడని, అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి పది పదిహేను రోజులకు తిరిగి ఇంటికి వచ్చేవాడని తెలిపారు. అలాగే ఈసారి కూడా వస్తాడని అనుకున్నామని, ఇలా జరుగుతుందని అనుకోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో మృతదేహం కనిపించడంతో పాటు ఘనట స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని కుమార్తె తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆత్మకూరులో నకిలీ విత్తనాల దందా

### -తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్

**సదాశివపేట, మే 19, ప్రభాతవార్త:** మండలంలోని ఆత్మకూరు గ్రామంలో నకిలీ విత్తనాలు, మందులను సరఫరా చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక విలేఖులతో పృథ్వీరాజ్ మాట్లాడుతూ గ్రామంలో వ్యాపారస్తుడు జైన ఉదామ్ ప్రభుత్వం నుంచి ఎలాంటి లైసెన్సులు పొందకుండా విత్తనాలు, మందులను అమ్ముతున్నా అధికారులకు పట్టకపోవడం విడ్డూరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందరికి అన్నం పెట్టే అన్నదాతలను మోసం చేసే నకిలీ వ్యాపారులపై పిడి యాక్టు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న మందుల దుకాణాలను వ్యవసాయ అధికారులు తనిఖీ నిర్వహించాలని సూచించారు. రైతు నాయకులు యం సంగిశెట్టి, జలీల్, అంజన్న, రమేష్, నర్సింహారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివితే ఎంతటి కష్టాన్నైనా ఎదిరించవచ్చు

**ములుగు, మే 19 (ప్రభాతవార్త):** విద్యార్థులు ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించి ఎంతటి కష్టాన్నైనా ఎదిరించి ఉన్నత శిఖరాలకు చేరవచ్చని ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ములుగు మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 50 మంది విద్యార్థులకు శుక్రవారం క్షీరసాగర్ గ్రామ జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో కెబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ బాల్‌రెడ్డి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఏఎంసి చైర్మన్ జహంగీర్, వైస్ ఎంపిపి దేవేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డిలు హాజరయ్యారు. సర్పంచ్ క్యాతి యాదమ్మ నర్సింగరావు, ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అంజన్‌గౌడ్, ఏఎంసి డైరెక్టర్ సురేష్, రాజేందర్‌రెడ్డి, బాపురెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మెట్రో 8పీఎం ఆల్బమ్ విడుదల

నౌటియాల్ నూరాన్ సిస్టర్స్ విశాల్ మిశ్రాజావేద్ అలీ, జోనితా గాంధీ తదితరులు నటించిన ఆల్బమ్ 8పీఎం ఆల్బమ్ మెట్రో ఆల్బమ్ విడుదలకు సిద్ధంగా ఉంది. అత్యంత ప్రతిభావంతుడైన మార్క్ కెరాబిన్ స్వరపరిచిన ఈ పవర్ ప్యాక్డ్ ఆల్బమ్‌లో నూరాన్ సిస్టర్స్ జుబిన్ నౌటియాల్, విశాల్ మిశ్రా,జోనితా గాంధీ జావేద్ అలీ, మరెన్నో స్వరాలు ఉన్నాయి.